నో గ్యారెంటీ!

మొదటిపేజీ తరువాయి...

అమలు చేస్తుందా? చేయదా? అని కర్ణాటక పరిణామాలను చూస్తే అనుమానాలు కలుగుతున్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా హామీల అమలు సాధ్యం కాదని కర్ణాటక సీఎం సిద్దరామయ్య ఆర్థిక సలహాదారు బసవరాజ్ రాయరెడ్డి తేల్చేశారు. హామీల్లో కొన్ని కోతలు పెట్టాల్సిందేనని తేల్చిచెప్పారు. తెలంగాణలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం అదే పని చేయబోతున్నదా? సీఎం రేవంత్‌రెడ్డి కాని, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కాని ఈ విషయంలో స్పష్టత ఇవ్వాలి. రైతు రుణ మాఫీ, రైతుబంధు, కనీస మద్దతు ధరతోపాటు ధాన్యం క్వింటాలుకు రూ.500 బోనస్, 200 యూనిట్ల ఉచిత కరెంటు హామీల అమలు విషయంలో ఇప్పటికీ స్పష్టత లేదు. కాలయాపన చేయటానికే శ్వేతపత్రాల విడుదల, ప్రజాపాలన దరఖాస్తు, వాటి క్రోడీకరణ, కంప్యూటీకరణ అంటూ నాటకాలాడుతున్నారు' అని కడియం మండిపడ్డారు.

తొందరపాటు గుర్తుచేస్తున్నాం

హామీలను అమలు చేయాలనే ప్రభుత్వానికి తాము గుర్తు చేస్తున్నామని కడియం శ్రీహరి తెలిపారు. కొత్త ప్రభుత్వం కుదుటపడేదాకా వేచిచూడాలన్నదే తమ ఉద్దేశమని, డిసెంబర్ 9వ తేదీ నుంచి అమలు చేస్తామని సీఎం ప్రజలకు స్పష్టమైన తేదీలు ప్రకటించిన నేపథ్యంలోనే బాధ్యతాయుత ప్రతిపక్షంగా ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వానికి గుర్తుచేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వంపై తమకేమీ అక్కసులేదని తేల్చిచెప్పారు. ప్రజా తీర్పును గౌరవించి ప్రతిపక్ష పాత్రనే పోషిస్తున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో దళితబంధు పథకాన్ని రెండు లక్షలు పెంచి రూ.12 లక్షలు ఇస్తామని చెప్పిందని, దీనిపై ప్రభుత్వ వైఖరి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. దళితబంధు, గృహలక్ష్మి వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందా? చేయదా? స్పష్టత ఇవ్వాలని కోరారు. ఎంసీహెచ్‌ఆర్డీని రాజకీయ సమావేశాల వేదికగా మార్చటం సరికాదని అన్నారు. అధికారిక కార్యక్రమాల నిర్వహణకు, అధికారుల శిక్షణ కోసం ఉద్దేశించిన ఎంసీహెచ్‌ఆర్డీలో సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ సమావేశాలు నిర్వహించటం వల్ల ప్రజలకు ఏం సంకేతాలు ఇస్తున్నారని ప్రశ్నించారు.

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయొద్దు

ప్రజాప్రతినిధుల విధి, నిధుల నిర్వహణ విషయంలో ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నదని కడియం విమర్శించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యేల (ఎస్‌డీఎఫ్)కు రూ.10 కోట్లకు కేటాయిస్తామని సీఎం పేర్కొనటాన్ని ఆయన స్వాగతించారు. అదే సమయంలో ఆ నిధులను ఇన్‌చార్జి మంత్రుల ద్వారా ఖర్చుచేస్తామని చెప్పటాన్ని తప్పుబట్టారు. ఇన్‌చార్జి మంత్రుల ద్వారా సీడీఎఫ్ నిధులు ఖర్చుచేయటం అప్రజాస్వామికమని విమర్శించారు. గతంలో ఎప్పుడూ ఎస్‌డీఎఫ్ నిధులను పూర్తిగా ఇన్‌చార్జి మంత్రులకు కేటాయించలేదని తెలిపారు. 50 శాతం ఇన్‌చార్జిలకు, మరో 50 శాతం నిధులను సంబంధిత ఎమ్మెల్యేలకు కేటాయించారని గుర్తుచేశారు. ఫార్ములా ఈ-రేసింగ్ నిధులు దుర్వినియోగమైతే విచారణ చేసి బాధ్యులపై చర్య తీసుకోవచ్చని, కానీ, రేస్‌నే రద్దుచేయటం సరికాదన్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల రాజీనామాల ఆమోదం

మొదటిపేజీ తరువాయి...

సుమిత్రానంద్ తనోబా, కోట్ల అరుణకుమారి రాజీనామా చేయకపోవడంతో వారు సభ్యులుగా కొనసాగుతారు. రాజీనామాలను ఆమోదించకుండా గవర్నర్ జాప్యం చేస్తున్నారని, దాంతో ఉద్యోగాల భర్తీపై నిర్ణయమూ తీసుకోలేకపోతున్నామంటూ మంగళవారం కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తూ గవర్నర్‌కు లేఖ రాశారు.

ఆమోదంలో జాప్యంలేదు

జీవన్‌రెడ్డి లేఖపై రాజ్‌భవన్ వర్గాలు వివరణ ఇచ్చాయి. రాజీనామాలపై వివరణ కోరి నిబంధనల ప్రకారం వాటిని ప్రభుత్వ పరిశీలనకు పంపినట్టు తెలిపింది. సిట్ దర్యాప్తు నేపథ్యంలో న్యాయ సలహా కోసం అడ్వకేట్ జనరల్‌కు సీఎం ద్వారా ఫైల్ పంపినట్టు వివరించింది. ఈ ఫైల్ మంగళవారం తిరిగి రాజ్‌భవన్‌కు చేరడంతో బుధవారం గవర్నర్ ఆమోదించారని పేర్కొన్నది. రాజ్యాంగం ప్రకారం న్యాయం, పారదర్శకత, జవాబుదారీతనాన్ని కాపాడేందుకు గవర్నర్ కట్టుబడి ఉన్నారని రాజ్‌భవన్ ప్రెస్ సెక్రటరీ తెలిపారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల రాజీనామాలు ఆమోదించినందున ప్రభుత్వం త్వరలోనే కమిషన్‌కు చైర్మన్‌ను నియమించనున్నది. ప్రస్తుతం ఇద్దరు సభ్యులు ఉండగా మరో 8 మందిని నియమించే అవకాశం ఉన్నది.

బీజేపీకి పలువురి గుడ్ బై!

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): బీజేపీకి చెందిన పలువురు నేతలు ఆ పార్టీని వీడనున్నట్టు సమాచారం. హైదరాబాద్ గోషామహల్‌కు చెందిన నేత విక్రమ్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు, సినీనటి జయసుధ, ఆకుల రాజేందర్ సహా పలువురు గురువారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి రాజీనామా పత్రాలను సమర్పిస్తారని తెలిసింది. అనంతరం వీరు కాంగ్రెస్‌లో చేరుతారని సమాచారం. కాంగ్రెస్‌కు చెందిన మాజీ మంత్రి ముఖేశ్‌గౌడ్ తనయుడు, సిటీ బీజేపీ యువనేత విక్రమ్‌గౌడ్ అలకబూనారు. గోషామహల్ టికెట్ ఇస్తామని బీజేపీ పెద్దలు ఆయనకు ఆశపెట్టి.. చివరికి రాజా సింగ్‌కు టికెట్ ఇచ్చారు. దీనిపై విక్రమ్‌గౌడ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు.



తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్ వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎంపీ దయాకర్, ఎమ్మెల్యేలు పోచారం, కడియం, ఎర్రబెల్లి, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, సత్యవతి రాథోడ్, పోచంపల్లి, నాయకులు వినోద్‌కుమార్, ధర్మారెడ్డి, పొన్నాల, గండ్ర, సారయ్య, రావుల చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

ప్రజాగొంతుక బీఆర్ఎస్ పార్టీ

- ఉఫ్‌మని ఊదేస్తే పోయేది కాదు
- బీఆర్ఎస్‌ను లేకుండా చేయటం ఎవరితరమూ కాదు
- క్యాడర్‌పై తప్పుడు కేసులు ఎదుర్కొంటాం
- ప్రభుత్వ విధానాలను ఎండగడతాం
- కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది
- త్వరలో శ్రేణులకు శిక్షణా తరగతులు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్‌ను ఉఫ్‌మని ఊదేస్తామని కొందరు పగటి కలలు కంటున్నారని, కేసీఆర్ తెలంగాణ ప్రజల గుండెల్లో ఉన్నంత కాలం బీఆర్ఎస్ ఉంటుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టంచేశారు. తెలంగాణ ప్రజల బలమైన గొంతుక బీఆర్ఎస్ అని అన్నారు. 23 ఏండ్లుగా బీఆర్ఎస్ పార్టీని లేకుండా చేయాలని చాలా మంది విశ్వప్రయత్నాలు చేసి విఫలమయ్యారని తెలిపారు. ఆర్ఎస్ఎస్ నుంచి ఆర్ఎస్‌యూ దాకా అందరూ బీఆర్ఎస్‌లో ఉన్నారని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీని లేకుండా చేయటం ఎవరితరమూ కాదని తేల్చిచెప్పారు. బుధవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వరంగల్ లోక్‌సభ నియోకవర్గ పార్టీ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నిస్థాయిల్లో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసి త్వరలోనే శిక్షణా తరగతులను నిర్వహిస్తామని తెలిపారు.

చెక్కుచెదరని ఉక్కు సంతకం కేసీఆర్

బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజల బలమైన గొంతుక అని, తెలంగాణ ఆకాంక్షలకు ప్రతిరూపమని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల గుండెలో కేసీఆర్ చెక్కుచెదరని ఉక్కు సంతకం అని పేర్కొన్నారు. అన్ని రకాల భావజాలాలతో తెలంగాణ ఆకాంక్షల పరిరక్షణే పరమావధిగా పనిచేసే శక్తియుక్తులన్న పార్టీ బీఆర్ఎస్ అని తెలిపారు. బలమైన తెలంగాణ గొంతుకగా ఉన్న బీఆర్ఎస్ రానున్న లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ క్యాడర్‌కు తెలంగాణ భవన్‌లో తాను, ఇతర సీనియర్ నేతలందరూ అందుబాటులో ఉంటామని, తెలంగాణ భవనే తమ అడ్డా అని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడుతున్నదని విమర్శించారు. తప్పుడు కేసులపై న్యాయపోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని అభయమిచ్చారు. పార్టీకి పటిష్ఠమైన లీగల్ సెల్ ఉన్నదని, తప్పుడు కేసుల బాధితులకు లీగల్‌సెల్ అండగా ఉంటుందని తెలిపారు. ఒక కార్యకర్తపై కేసు పెడితే ఆ ప్రాంతంలోని నాయకులంతా సమష్టిగా స్పందించాలని, కేసు తీవ్రతను బట్టి రాష్ట్ర నాయకత్వం కూడా స్పందిస్తుందని చెప్పారు.

కాంగ్రెస్‌కు సినిమా మొదలు కాలేదు

కాంగ్రెస్ పార్టీకి సినిమా ఇంకా మొదలు కాలేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలను నెరవేర్చేదాకా బాధ్యతాయుత ప్రతిపక్షంగా బీఆర్ఎస్ ప్రజల పక్షాన నిలబడుతుందని తెలిపారు. కాంగ్రెస్ హామీలను ప్రతిరోజూ గుర్తుచేస్తూనే ఉండాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అధికారంలోకి రాగానే తొందరపడి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకునపెడుతున్నారనే అపవాదును మూటగట్టుకోవద్దని అనుకున్నామని, అయితే ఈలోగా కేసీఆర్ ప్రభుత్వాన్ని బద్నాం చేసే పనికి కొత్త ప్రభుత్వం పూనుకొని అసత్య శ్వేతపత్రాలను విడుదల చేస్తున్న నేపథ్యంలో స్పందించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ అబద్ధాలు చెప్పి తప్పించుకోవాలని చూస్తే ప్రధాన ప్రతిపక్షంగా నిలదీస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి ఆసలు సినిమా ముందున్నదని అన్నారు. కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ అక్కసుతో రద్దు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. జిల్లాలు రద్దు చేస్తామని సీఎం అవగాహన లేకుండా మాట్లాడారని విమర్శించారు. జిల్లాలు రద్దు చేస్తే ప్రజలు ఊరుకుంటారా ? అని ప్రశ్నించారు. సమావేశంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, అసెంబ్లీ మాజీ స్పీకర్లు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సిరికొండ మధుసూదనాచారి, మాజీ ఉప ముఖ్యమంత్రులు కడియం శ్రీహరి, టీ రాజయ్య, ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బస్వరాజు సారయ్య, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎంపీలు బోయినపల్లి వినోద్‌కుమార్, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్లు సుధీర్‌కుమార్, గండ్ర జ్యోతి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయభాస్కర్, గండ్ర వెంకటరమణారెడ్డి, చల్లా ధర్మారెడ్డి, అరూరి రమేశ్, నన్నపునేని నరేందర్, ఎన్ సుధాకర్ రావు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

వీల్‌చైర్‌లో తెలంగాణభవన్‌కు వస్తున్న యాదగిరి

బీఆర్ఎస్‌కు పూర్వవైభవం వస్తుంది: గండి యాదగిరి

కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్‌కు తిరిగి పూర్వవైభవం వస్తుందని స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం లింగాల గణపురం మండలం వడిచర్ల గ్రామానికి చెందిన గండి యాదగిరి అన్నారు. దివ్యాంగుడినైన తాను మొదటి నుంచి బీఆర్ఎస్ పార్టీతో మమేకం అయ్యాయని తెలిపారు. బుధవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వరంగల్ పార్లమెంట్ సన్నాహక సమావేశంలో పాల్గొనేందుకు ఆయన వీల్‌చైర్‌లో వచ్చారు. యాదగిరిని చూసి పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం ఏర్పడింది.

బీఆర్ఎస్‌దే భవిష్యత్తు

బీఆర్ఎస్ పార్టీదే భవిష్యత్తు అని, పార్టీ శ్రేణులెవరూ నిరుత్సాహ పడాల్సిన పనిలేదని కేటీఆర్ చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికిగల కారణాలను సంపూర్ణంగా విశ్లేషించుకొని భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకుందామని తెలిపారు. పదేండ్లలో తెలంగాణను అద్భుతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. 'ప్రభుత్వం పథకాలు అమలు చేసే క్రమంలో పంచాయతీ నుంచి పార్లమెంట్ దాకా అన్ని స్థాయిల్లో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులే ఉండటం, వారిని పార్టీ ప్రతినిధులుగానే ప్రజలు గుర్తిస్తారని భావించి ప్రత్యేకంగా ప్రతి కార్యక్రమాన్ని పార్టీ కార్యక్రమంగా నిర్వహించాల్సిందనే ఆలోచనతోనే చేశాం తప్ప పార్టీని విస్మరించాలని కాదు. నిత్యం ప్రజల మధ్యే ఉన్న అభ్యర్థులు కూడా ఓడిపోవడం కొంత బాధాకరమే. లోపం ఎక్కడ జరిగిందో గ్రహించి సరిదిద్దుకునే కార్యాచరణ రూపొందించుకొందాం. తిరిగి ప్రజాభిమానాన్ని పొందుతామనే ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుదాం. ప్రజలు బీఆర్ఎస్‌ను పూర్తిగా తిరస్కరించలేదు. 39 మంది ఎమ్మెల్యేలను గెలిపించి బీఆర్ఎస్‌ను బాధ్యతాయుత ప్రతిపక్షంగా ఉండాలని తీర్పు ఇచ్చారు' అని వివరించారు.

జనగామ జిల్లా బచ్చన్నపేటలో బీఆర్ఎస్ కృతజ్ఞతా సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

కాంగ్రెస్ బెదిరింపులకు భయపడేది లేదు

- బ్యాంకుల్లో రూ.7,500 కోట్లున్నా రైతుబంధు ఎందుకు వేయడం లేదు?
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

బచ్చన్నపేట, జనవరి 10 : 'కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ కార్యకర్తలను బెదిరిస్తున్నారు. వాటికి భయపడేది లేదు. ప్రతి గ్రామానికి వస్తా.. సమస్యలను పరిష్కరిస్తా'నని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం జనగామ జిల్లా బచ్చన్నపేటలో బీఆర్ఎస్ కృతజ్ఞతా సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ సర్కారు విజిలెన్స్, తనిఖీలు, కేసులు పెట్టడం, బెదిరింపులకు గురిచేస్తున్నదని ఆరోపించారు. కొందరు కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ కార్యకర్తలపై కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. ప్రొటోకాల్ విషయంలో ప్రభుత్వం వివక్ష చూపుతున్నదని మండిపడ్డారు. మంత్రి స్థాయిలో కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం బ్యాంకుల్లో నిల్వ ఉంచిన రూ.7,500 కోట్ల రైతుబంధు ఇంతవరకు ఎందుకు వేయడం లేదని ప్రశ్నించారు. అబద్ధాలతో, ఊకదంపుడు ఉపన్యాసాలు, సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారాలతో మార్పు అనే పదంతో కాంగ్రెస్ అధికారం చేజిక్కించుకున్నదని విమర్శించారు. కేసీఆర్ హయాంలోనే తెలంగాణ సస్యశ్యామలమైందని అన్నారు. ప్రతి ఊరిలో చెరువును గోదావరి జలాలతో నింపిన విషయాన్ని గుర్తుచేశారు. ఎంపీ ఎన్నికల్లో కష్టపడి పనిచేసి పార్టీ మెజార్టీ సీట్లు గెల్చుకునేలా ప్రతి కార్యకర్త పని చేయాలని సూచించారు.

పాతపద్ధతిలోనే వర్సిటీ రిక్రూట్‌మెంట్లు?

- వర్సిటీల వారీగానే నియామకాలు
- కామన్ రిక్రూట్‌మెంట్‌బోర్డు బిల్లు రద్దు?
- రాజ్‌భవన్‌తో సీఎంవో సంప్రదింపులు

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని 15 విశ్వవిద్యాలయాల్లో బోధన, బోధనేతర సిబ్బంది పోస్టుల భర్తీకి తలపెట్టిన 'ది తెలంగాణ యూనివర్సిటీస్ కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు బిల్లు'ను కాంగ్రెస్ ప్రభుత్వం ఉపసంహరించుకోనున్నది. పాత పద్ధతిలోనే వర్సిటీ రిక్రూట్‌మెంట్లు నిర్వహించాలని నిర్ణయించింది. ఏ యూనివర్సిటీ పరిధిలోని పోస్టులను ఆయా వర్సిటీలే నోటిఫికేషన్లు జారీచేసి, భర్తీచేస్తాయి. ఆయా పోస్టుల భర్తీకి ఎలాంటి స్క్రీనింగ్ టెస్ట్ ఉండదు. సర్టిఫికెట్ల పరిశీలన, ఇంటర్వ్యూ విధానంలో నియామకాలను పూర్తిచేస్తారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రతిపాదించిన బిల్లు ఉపసంహరణకు ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవలే విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీని ఆదేశించారు. దీంతో ఈ బిల్లు ఉపసంహరణకు రాజ్‌భవన్‌తో సీఎంవో, విద్యాశాఖ వర్గాలు సంప్రదింపులు జరుపుతున్నాయి.

బోర్డు ఏర్పాటుచేసిన కేసీఆర్ సర్కార్

రాష్ట్రంలోని వర్సిటీల్లో బోధన పోస్టుల భర్తీకిగాను కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డును కేసీఆర్ సర్కారు ఏర్పాటు చేసింది. స్క్రీనింగ్ టెస్ట్ (రాతపరీక్ష) ద్వారా ప్రతిభావంతులను ప్రొఫెసర్లుగా నియమించేందుకు బోర్డును ఏర్పాటుచేస్తూ అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో 'ది తెలంగాణ యూనివర్సిటీస్ కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు' బిల్లుకు 2023 సెప్టెంబర్‌లో రాష్ట్ర అసెంబ్లీ ఆమోదం తెలిపింది. పలు సందేహాలు చెప్తూ గవర్నర్ ఈ బిల్లును ఆమోదించలేదు. దీంతో అప్పటి విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి, అధికారులు రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో సమావేశమై సందేహాలకు వివరణ ఇచ్చారు. ఈ వివరణకు సంతృప్తి చెందని గవర్నర్ యూజీసీ చైర్మన్‌కు లేఖ రాశారు. యూజీసీ నిబంధనల ప్రకారమే రిక్రూట్‌చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్‌కు తెలిపింది. అయినా సంతృప్తి చెందని గవర్నర్ ఆ తర్వాత బిల్లును రాష్ట్రపతి పరిశీలనకు పంపించారు. ఈ నేపథ్యంలో ఈ బిల్లును ఉపసంహరించుకునే యోచనలో కొత్త ప్రభుత్వం ఉన్నది.

1,977 ఖాళీలపై ప్రభుత్వానికి నివేదిక

రాష్ట్రంలోని వర్సిటీల్లో బోధనా సిబ్బంది ఖాళీ పోస్టుల వివరాల నివేదికను ఇటీవలే ప్రభుత్వానికి సమర్పించారు. 2017లోనే 1,061 పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ ఆమోదం తెలిపింది. మరో 1,977 టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అన్ని వర్సిటీలకు మొత్తంగా 2,825 పోస్టులు మంజూరయ్యాయి. ప్రస్తుతం 873 మంది ఆచార్యులు పనిచేస్తుండగా, 1,977 ఆచార్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు 1,013, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు 757, ప్రొఫెసర్ పోస్టులు 207 ఖాళీగా ఉన్నాయి.

శభాష్ హెచ్ఎం

గంజాయి చాక్లెట్ల గుట్టు రట్టు చేసిన హెడ్‌మాస్టర్

విద్యార్థులకు చాక్లెట్లు అమ్మిన ముఠా ● పిల్లల ప్రవర్తనలో తేడా గమనించి నిఘాపెట్టిన టీచర్

ఆధారాలతో పోలీసులకు ఫిర్యాదు.. ముగ్గురి అరెస్టు ● 8 కిలోల గంజాయి చాక్లెట్లు స్వాధీనం

హైదరాబాద్ సిటీబ్యూరో/కొత్తూరు/శంషాబాద్ రూరల్ జనవరి 10 (నమస్తే తెలంగాణ): అది రంగారెడ్డి జిల్లా కొత్తూరులోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల.. ఈ మధ్య ఈ పాఠశాల బాలురంతా వింతగా ప్రవర్తించటం మొదలుపెట్టారు. బెంచీలపై పడుకోవటం, క్లాస్‌లోనే మూత్రవిసర్జన చేయటం, బాలికల ముందు అసభ్యంగా ప్రవర్తించటం చేశారు. అలా ఒకరిద్దరు చేస్తే దండించి వదిలిపెట్టేవారే ఆ హెడ్‌మాస్టర్. కానీ, చాలా మంది అలాగే ప్రవర్తించటంతో హెడ్‌మాస్టర్ అంగూర్ నాయక్‌కు అనుమానం వచ్చింది. అసలు వీళ్లకేం జరుగుతున్నదో తెలుసుకోవాలని నిఘా పెట్టారు. వాళ్లతో స్నేహంగా ఉంటూనే, వాళ్లేం చేస్తున్నారో గ్రహించారు. ఎక్కడి నుంచో చాక్లెట్లు తీసుకొచ్చి తింటూ ఇలా క్లాస్‌రూమ్‌లో పడిపోతున్నట్టు గుర్తించారు. తనకూ ఆ చాక్లెట్లు కావాలని అడిగి తిని రుచి చూశారు. అందులో గంజాయి కలిసిందని తెలుసుకొని, ఎక్కడ దొరుకుతాయో వివరాలు సేకరించారు. దీంతో అసలు విషయం బయటపడింది. కొత్తూరు పోలీసు స్టేషన్‌కు అనుకుని ఉన్న ఒక కిరాణాషాపుతో పాటు స్థానికంగా ఉన్న పాన్‌షాప్, పాఠశాల పరిసరాల్లో ఉన్న పలు కిరాణా దుకాణాల్లో మత్తు చాక్లెట్లను విక్రయిస్తారని సదరు విద్యార్థులు చెప్పారు. ఒక్కో చాక్లెట్ రూ.25కు లభిస్తుందని, వాటిని చాలా మంది విద్యార్థులే కాకుండా ఇతరులు కూడా కొంటారని విద్యార్థులు తెలిపారు.

డీఈవో సహకారంతో పోలీసులకు ఫిర్యాదు

ఆధారాలతో వివరాలు సేకరించిన అంగూర్ నాయక్.. ఈ విషయాన్ని జిల్లా విద్యాధికారికి తెలియజేశారు. సదరు విద్యాధికారి మాజీ జైలర్ కావటంతో ఆయన తనకున్న పోలీసు ఉన్నతాధికారుల సహకారంతో నేరుగా శంషాబాద్ జోన్ డీసీపీ నారాయణరెడ్డికి సమాచారం అందించారు. ఆయన స్థానిక ఎస్‌వోటీ బృందాలతో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి గంజాయి చాక్లెట్ల గుట్టు రట్టుచేశారు. ఈ వివరాలను బుధవారం పోలీసులు మీడియాకు వెల్లడించారు. ఒడిశాకు చెందిన వీరేంద్ర బెహరా (33), సోమనాథ్ బెహరా(35), సురిజ్యామిని సాహూ(35) కొత్తూరు మున్సిపాలిటీలో వివిధ ప్రైవేట్ కంపెనీల్లో పనిచేస్తూ, ఒడిశాలో రూ.9కి గంజాయి చాక్లెట్లను కొని, 'చార్మినార్ మునక్కా గోల్డ్' పేరుతో ఇక్కడికి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. వీరిని అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

కొత్తూరు ఠాణా పక్కనే విక్రయాలు

మత్తు చాక్లెట్లను దర్జాగా కొత్తూరు పోలీస్ స్టేషన్ ప్రహరీ గోడకు ఆనుకొని ఉన్న కిరాణాషాపులోనే విక్రయించటం గమనార్హం. ఠాణా పక్కన 'సంతోష్ కిరాణ అండ్ జనరల్ స్టోర్' పేరుతో ఏడాది కాలంగా మత్తు చాక్లెట్లను వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. కిరాణ షాపుల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టగా 8 కిలోల గంజాయి చాక్లెట్లు లభించాయి. పరిసర ప్రాంతాల్లో మరికొన్ని దుకాణాల్లో సైతం పోలీసులు తనిఖీలు నిర్వహించగా, నిందితులు పరారైనట్టు తెలిసింది. కాగా, ఒక చాక్లెట్ తీసుకుంటే సుమారు 48 గంటల వరకు మత్తు ఉంటుందని బాధితులు చెప్తున్నారు. విద్యార్థులు ఒక చాక్లెట్‌ను నలుగురు షేర్ చేసుకుని తింటారని, దీంతో కనీసం 12 గంటలపాటు మత్తులో జోగుతున్నట్టు తేలింది. ఆ ప్రాంతంలో విద్యార్థులే కాకుండా, కార్మికులు, యువత కూడా గంజాయి చాక్లెట్లు తింటున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. హెడ్‌మాస్టర్ అంగూర్ నాయక్ గుర్తించకపోతే తమ బిడ్డల పరిస్థితి ఏమయ్యేదోనని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల కిందటే ఈ పాఠశాలలో డ్యూటీలో చేరిన ఆయన.. విద్యార్థుల భవిష్యత్తు కాపాడి, శభాష్ అనిపించుకున్నారు.

గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకొని కేసు వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న పోలీసులు

లోకం పోకడ



ఒక్కో కుటుంబానికి ఇల్లు చాలదు సారూ.. అపార్ట్‌మెంట్ కావాలి!

బీఆర్ఎస్సే మనకు ప్రత్యర్థి

కార్పొరేటర్లతో బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్టీయే తమకు ప్రథమ ప్రత్యర్థి అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చెప్పారు. బుధవారం జీహెచ్ఎంసీలోని బీజేపీ కార్పొరేటర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నా, గ్రేటర్ హైదరాబాద్‌లో మాత్రం బీఆర్ఎస్సే ప్రత్యర్థి అని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ కార్పొరేటర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించినట్టు తెలిసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ అటు బీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్ కార్పొరేటర్లతో కలువొద్దని స్పష్టం చేసినట్టు సమాచారం. ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలవడం వంటివి కూడా చేయవద్దని చెప్పినట్టు తెలిసింది. ఏమైనా సమస్యలు ఉంటే ప్రజలతో కలిసి పోరాడాలని సూచించారు.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
మెదక్	15.1°c	31.5°c
ర